కథ

**"వంకాయలూ, బెండకాయలూ వున్నాయి. ఏం వండను?" ఫ్రిజ్‌లోంచి కూరగాయల ట్రే తీస్తూ అడిగింది వసంత.**

**"కాకరకాయలు వేయించు" కసిగా అన్నాడు సారధి.**

**ఆమె చుర చుర చూసి, వంకాయలు తరగసాగింది.**

# ప్రేమరాహిత్యం

★ ★ ★

ఏం వండను?.. పిల్లలకి స్కూలు టైమౌతోంది, త్వరగా తయారై దింపి రా. గేస్ అయిపోయింది. ఇదేనా భార్యా భర్తలమధ్య జరిగే సంభాషణ? ఆ ప్రశ్నకి జవాబు వెతుక్కుంటున్నాడు సారధి.

పబ్లిక్‌గార్డెన్స్ లాన్లో ఒక్కడూ పడుకుని వున్నాడు. పైన ఆకాశంలో గుంపులు గుంపులుగా మబ్బులు. వాటికి బాగా కింద పక్షులు బారులు తీరి ఎగుర్తున్నాయి. కాస్త దూరాన పిల్లలు కేరింతలు కొడ్తూ ఆడుకుంటున్నారు. ఇంత సందడి మధ్య కూడా సారధి మనసు ఒంటరిగానే వుంది. పెళ్ళైన పదేళ్ళకి అనిపిస్తోందతనికి తన వైవాహిక జీవితంలో ఏదో లోపం వుందని.

మనిషి తనకి ప్రేమించడం, ద్వేషించటం తప్ప మరొకటి తెలీదనుకుంటాడు. కానీ ఈ రెండిటికీ మధ్యస్థమైన స్థితి ఇంకొకటి వుంది. అది ప్రేమరాహిత్యం. నిత్యం ఎంతోమంది తారసపడ్తారు. వాళ్ళందరిపట్లా ప్రేమగానీ ద్వేషంగానీ వుండదు. పెళ్ళైన ఇంతకాలం గడిచాక తనకీ వసంతకీ మధ్యనున్న పరిస్థితి కూడా ఇంతేననుకుంటే అతనికి ఆశ్చర్యం కలుగుతోంది.

వసంత లేకుండా బ్రతకలేనని ఎప్పుడూ అనుకోలేదు సారధి. అలాగని ఆమెని చేసుకున్నందుకు విచారపడిన సందర్భం కూడా లేదు.

అసలేంటో! ఒకరినొకరు కావాలనుకున్నారో వద్దనుకున్నారో తెలీకుండానే తమ పెళ్ళైంది. ఇద్దరివీ పక్కపక్క ఇళ్ళు. వసంత పుట్టినప్పట్నుంచీ ఆమె జీవితంలో జరిగిన ప్రతి సంఘటనా తనకి తెలుసు. కలిసి ఆడుకున్నారు. చదువుకున్నారు. అప్పుడెంతో సరదాగా నవ్వుతూ తుళ్ళుతూ వుండిన వసంత పెళ్ళయ్యాక మారిపోయింది. తన తల్లిలా, ఆమె తల్లిలా, ఇంకా ఎందరో స్త్రీలలా గృహిణిగా మారిపోయింది.

తను? పుట్టుక, చదువు, ఉద్యోగం, పెళ్ళి, బారసాల.. ఒక మగవాడి జీవితంలో ఎన్ని తతంగాలుంటాయో అవన్నీ జరిగాయి. అన్నీ జనాంతికంగానే.

కానీ.. వీటన్నిటికీ అతీతంగా తన మనసు ఇంకేదో కోరుకుంటోంది. ఎందుకని తన జీవితం ఇంత రసహీనంగా తయారైంది? ఉండటానికో స్వంతిల్లుంది. బ్యాంకులో ఉద్యోగం, చక్కటి భార్య, పిల్లలు. అందరూ వేటికోసమైతే ఆరాటపడ్తారో అవన్నీ తనకున్నాయి. మరి?

సారధి ఆలోచనలు అక్కడ ఆగిపోయాయి. సరిగ్గా అప్పుడే మెత్తటి పచ్చిక మీద సుపరిచితమైన అడుగుల చప్పుడు. అది చెలానిది. చెలం సారధి బాల్యంలోని మరో పార్శ్వం. వసంత సారధితో ఎన్ని ఆటలు ఆడిందో చెలంతో అంతకంటే ఎక్కువే ఆడింది. అతనికి హైదరాబాద్‌లో ఉద్యోగం. ఎప్పుడైనా సెలవుపెట్టి వరంగల్ వస్తాడు. అలా వచ్చినప్పుడు సారధిని కలవకుండా వుండడు.

''ఎప్పుడొచ్చావు?'' అడిగాడు సారధి.

''ఇప్పుడే. ఇంటికెళ్ళి బేగ్‌పెట్టి నీకోసం మీ ఇంటికెళ్తే నువ్విక్కడుంటావని చెప్పింది వసంత'' పక్కన తనూ కూర్చుంటూ చెలం ''ఒక్కడివీ ఇక్కడేం చేస్తున్నావు?'' అన్నాడు.

సారధి కాసేపటికి అన్నాడు ''లైఫ్ బోర్ కొడ్తోందిరా'' అని.

తను సరిగ్గానే విన్నాడా అనే అనుమానం కలిగింది చెలానికి ''ఏమిటి?''

''ఏమిటో.. విసుగ్గా అనిపిస్తోంది''

''అప్పుడేనా?''

''ఎప్పట్నుంచో''

''ఎందుకని అలా?''

''ఏమో!''

మళ్ళీ కొద్దిసేపు ఇద్దరూ మాట్లాడుకోలేదు.

''ఎందుకు? వసంత నీతో సరిగా వుండదా?'' అడగలేక అడిగాడు చెలం.

సారధికీ వసంతకీ పెళ్ళవటంతో అతను వాళ్ళ అంతరంగిక విషయాలకి సంబంధించినంత వరకూ బైటివాడిగానే వుండిపోయాడు. ఆ దూరం వసంతతో మరీ స్పష్టంగా ఏర్పడిపోయింది.

''ఛ.. అదేం కాదు. వసంత చాలా మంచిది'' అన్నాడు సారధి.

''మరేంటట?''

''అదే అర్థం కావటం లేదు''

చెలం అతని ముఖంలోకి పరీక్షగా చూసి అడిగాడు ''నేను చెప్పనా?'' అని.

తలూపాడు సారధి.

''అన్నీ అమరిన జీవితం. సాధించడానికంటూ ఏదీ లేదు. అలాంటప్పుడు స్తబ్దత చోటుచేసుకుంటుంది. ఏదేనా కొత్త వ్యాపకం కల్పించుకో''

సారధి నవ్వాడు. తన సమస్యలోని మౌలికత అది కాదు. దాన్ని వ్యతిరేకించడం తనకి రాదు. అదొక అంతర్మథనం.

''సరేగానీ నీ సంగతేంటి? ఎంతకాలం ఇలా పెళ్ళి చేసుకోకుండా వుంటావు? ఆ అమ్మాయెవరో ఈపాటికి పిల్లల తల్లి కూడా అయివుంటుంది'' అన్నాడు మాటమార్చి.

హఠాత్తుగా గాలి తనమీదికి మళ్ళేసరికి చెలం ఉక్కిరిబిక్కిరయ్యాడు. అతనో అమ్మాయిని ప్రేమించి భంగపడ్డాడు. అందుకే ఇంతకాలం పెళ్ళి చేసుకోలేదు. సారధికి అంతవరకే తెలుసు. ఆ అమ్మాయెవరో చెలంలాంటి హీరోని ఎందుకు కాదందో తెలీదు. చెలం కూడా ఎప్పుడూ చెప్పలేదు. మిత్రుడి మనసు నొప్పించటం ఇష్టం లేక సారధి కూడా అడగలేదు.

''జరిగిందేదో జరిగిపోయింది. డబ్బుకి డబ్బా అందానికి అందం రెండూ వున్నవాడివి, సున్నిత మనస్కుడివి, నిన్నే కాదందంటే ఆ అమ్మాయికి బలమైన కారణం ఏదో వుండి వుండాలి. లేకపోతే నీది ఏకపక్ష ప్రేమేనా కావాలి. అవన్నీ మర్చిపో. హేవ్ ఎ ఫ్రెష్ బిగినింగ్'' అతని తట్టాడు సారధి.

చెలం ఆశ్చర్యపోయాడు. తనకో ప్రేమకథ వుందని ఎప్పుడూ ఎవరికీ చెప్పుకోలేదు. అయినా అందరూ తను పెళ్ళి చేసుకోవటం వెనక ఏదో వుందని వూహాగానాలు చేస్తున్నారు. నిజంగా అంతగా ప్రేమించాడా తనామెని?

''అమ్మ చాలా గొడవ చేస్తోంది నా పెళ్ళి చూడాలని. వదినలు తలో సంబంధం తెస్తున్నారు. ఏదో ఒకటి ఒప్పేసుకుని నో వేకెన్సీ బోర్డు పెట్టేయాలనుకుంటున్నాను'' అన్నాడు.

''ఇంకేం?''

''ఆ పనిమీదే వచ్చాను. మా పెద్దొదిన చెల్లెలి పెళ్ళిలో ఒకమ్మాయిని చూపించారు. పోస్ట్‌గ్రాడ్యుయేట్. ఏవరేజీగా వుంటుంది. సరేననేశాను'' భావరహితంగా వుంది చెలం గొంతు.

"''ఇంత మంచివార్తని అంత నిర్లిప్తంగా చెప్తా వేం(టా?'' అడిగాడు సారధి.

పెళ్ళి విషాదానికి నాంది పలకడం ఈ ఒక్క వేద భూమిలోనే జరుగుతుందేమో! తెలిసోతెలీకో (పేమలో పడటం.. అది పెళ్ళిగా పరిణమించడా నికి గల అవకాశాలకంటే అలా పరిణమించకుండా వుండటానికి ఆటంకాలే ఎక్కువ. కులం, మతం, జాతకాలు, గో(త్రాలు, పెద్దల ఇష్టాయిష్టాలు, పెట్టు పోతలు.. ఒకటేమిటి? అన్నీను. అక్కడితో ఆ (పేమకి సమాధికట్టేసి దానిమీద పెళ్ళికి పునాది లేపడం, ఆపైన జీవితం విషాదకావ్యమే కదా?

ఆలోచిస్తున్న సారధిని చూసి చెలం నవ్వాడు. ఆ నవ్వులో ఒక విచి(త్రమైన భావన వ్యక్తమైంది. దాన్ని సారధి భరించలేకపోయాడు.

''పద వెళ్దాం'' అన్నాడు లేచి నిలబడి.

ఇంక మాట్లాడుకోవటానికంటూ ఏమీ మిగ ల్లేదు కాబట్టి ఒకరింటికి ఇంకొకరు వెళ్ళే ఆలోచన చెయ్యలేదు. సందు మలుపు దగ్గర విడిపోయారు.

★ ★ ★

''చెలం పెళ్ళి కుదిరింది'' ఇంట్లో అడుగు పెడ్తూనే అన్నాడు సారధి.

వంటింట్లో వున్న వసంత ఉలిక్కిపడింది. మన సంతా ఏదో అర్థంకాని అలజడి నిండిపోయింది.

చెలానికి పెళ్ళా? చెలం పెళ్ళిచేసుకోబోతు న్నాడా? అపనమ్మకంగా అనిపించింది. తను పెళ్ళిచేసుకుంది. సారధీ చేసుకున్నాడు. అలాగే చెలం కూడానని అనిపించ లేదు. తనదైనదేదో పరా యిగా మారిపోతున్న భావన కలిగింది. మళ్ళీ మళ్ళీ అదే ఆలోచన. ఆలోచించిన కొద్దీ బాధ పెరుగుతోంది.

''ఏంటి అలా వున్నావు?'' భోజ నాలప్పుడు సారధి అడిగితే తనే మళ్ళీ ఆశ్చర్యపోయింది చెలం పెళ్ళి వార్త వినగానే తను ఎలాగో వుండటమేమిటని.

''తలనొప్పిగా వుంది'' అని తోచిన జవాబు చెప్పింది.

భోజనాలయ్యాయి. పిల్లల్ని వాళ్ళ గదిలో పడు కోబెట్టి వచ్చి సారధి పక్కన డబల్‌కాట్ అంచున పడుకుంది. ఇద్దరికీ మధ్య అందనంత దూరం. సారధి తనే జరిగి దగ్గరికొ చ్చాడు. మీద చెయ్యేసి దగ్గరకు తీసుకోబో యాడు.

''ప్లీజ్.. వద్దు'' అంది అతనికేసి తిరక్కుండానే.

సారధి చెయ్యి వెనక్కి తీసేసుకున్నాడు. అతని గుండెల్లో చివ్వుమని ఎగిసిన బాధ. ఎందుకు వసంత ఇలా మూడీగా, డల్‌గా వుంటోంది? తన చేతుల్లో కరిగిపోవటానికి బదులు, ఈ చర్యని కావాలి- వద్దు అనుకునే అవస రంగా మార్చేసింది. అతనికి పెద్దగా ఏడవాలనిపించింది. నిజంగా ఏడుస్తానే మోననే భయం కూడా కలిగింది. దిండులో ముఖం దాచుకుని బోర్లా పడు కున్నాడు. ఎప్పటికో నిద్రపట్టింది.

వసంతకి ఆ రా(త్రంతా నిద్రలేదు.


★ ★ ★

చెలానికి పెళ్ళి గురించి ఏమీ సంతోషం లేదు. ఉచ్చు మెడ చుట్టూ బిగుసుకుంటున్నట్టే వుంది. ఇప్పటిదాకా తనకి సంతోషం లేకపో యినా స్వేచ్ఛ వుంది. ఇకమీదట అది కూడా వుండదేమో! అశాంతిగా అనిపించింది. అతను అనుభవిస్తున్న అశాంతికి అది ఒక కొస. దాని ఇంకో కొసని...

'లైఫ్ బోర్ కొడ్తోందిరా!' సారధి మాటలు వెంటాడుతున్నాయి.

ఏమిటి, సారధికి బోర్ కొడ్తున్నది జీవి తమా? వసంతా? వసంత బోర్‌కొడ్తే ఆమెతో పంచుకునే జీవితమూ అలాగే వుంటుంది. కానీ అలా ఎలా జరుగుతుంది. ఇద్దరూ ఒకరి నొకరు ఇష్టపడి చేసుకున్నాక?

సారధి అతని పెళ్ళి కుదిరిన పుడు అన్న మాటలు ఇప్ప టికీ చెలం మర్చిపో లేదు. అవి శిలాక్షరాల్లా అతని గుండెలమీద వుండి పోయాయి. అతన్లో ఒక నిబద్ధతనీ నియం(త్రణనీ ఏర్పరిచాయి.



''నా పెళ్ళి ఫిక్సైందిరా సడెన్‌గా. ఇదింత హఠా త్తుగా జరుగుతుందని నేను ఊహించలేదు. అంత కన్నా ఆశ్చర్యకరమైన విషయం.. వసంతతో. చిన్నప్పట్నుంచీ తెలిసిన అమ్మాయితో పెళ్ళంటే గమ్మత్తుగా లేదూ? నిజా నికి నాకిప్పటిదాకా తనపట్ల అలాంటి దృష్టిలేదు. వుండివుంటే రోజూ కాసిని (పేమకబుర్లు చెప్పేవా డిని'' అని పెద్దగా నవ్వాడు సారధి.

''వసంతేమంది?'' చెలం (ప్రశ్న. అతని గొంతు

ఎస్.శ్రీదేవి

లోని భయం, ఆర్తి, ఆతృత... ఇవేవీ సారధి గుర్తించలేదు. తన ధోరణిలో తను చెప్పుకుపోయాడు.

''ఇష్టమేనంది''

ఆ చిన్న వాక్యం చెలం గుండెల్లో డైనమెట్లు పేల్చింది. అతను వసంతని ప్రేమించాడు. పెద్దవాళ్ళు తమ పెళ్ళికి ఒప్పుకోరు. కులం, గోత్రం లాంటి ఆక్షేపణలూ, అభ్యంతరాలూ వాళ్ళకెన్నో వుంటాయి. అయినా అందర్నీ ఎదిరించైనా ఆమెని పెళ్ళిచేసుకోవాలనుకున్నాడు. ఆ ప్రేమని ఇంకా ఆమె ముందు ప్రకటించనే లేదు, ఆమె పెళ్ళి స్థిరపడింది సారధితో. ఇద్దరికీ ఇష్టమేనంట? మరి తను? ఓటమితో రాజీపడి మౌనాన్ని ఆశ్రయించటమే.. అదే ఇన్నాళ్ళూ చేశాడు. ఇప్పుడు... ఇన్నేళ్ళ తరువాత సారధి అన్న మాటలు అతన్ని మళ్ళీ ఆలోచనలో పడేసాయి. అశాంతిని రేపాయి. సారధి సమస్య తనకి ఎక్కడో సంబంధం వుందనిపించింది. మూలం వెతకబోయాడు. మళ్ళీ మానుకున్నాడు.

★ ★ ★

''కంగ్రాట్స్. పెళ్ళి చేసుకోబోతున్నావటగా? స్నేహితుడికోసం ప్రేమని త్యాగం చేసావు. ప్రేమించిన అమ్మాయికోసం పెళ్ళిని వద్దంటావనుకున్నాను'' తెల్లారి మూడింటికి వసంత చేసిన ఫోన్ కాల్‌తో చెలం నిద్రమత్తంతా ఎగిరిపోయింది.

''వ...సం...తా!'' దిగ్భ్రాంతిగా అన్నాడు.

''కనీసం ఇప్పటికైనా హేపీగా వుండు చెలం'' ఆమె డిస్కనెక్ట్ చేసేసింది. కానీ ఆమె గొంతులోని దుఃఖం చెలాన్ని విచలితుడిని చేసింది.

అసలే పెళ్ళిపట్ల ఎలాంటి సరదా లేని చెలం ఇప్పుడు మరింత విముఖతలో పడ్డాడు. అందులో కొంత అయోమయం కూడా వుంది. సారధిని ఇష్టపడి చేసుకున్న వసంత... అతని ఆలోచనలు ముందుకి సాగటం లేదు.

★ ★ ★

చెలం ఇంకా ఆ విభ్రాంతిలోంచీ, అయోమయంలోంచీ బైటపడనేలేదు. ఉదయాన్నే సారధి వచ్చి ''నువ్వు ఈవేళ ఫ్రీయేగా? నేనూ లీవు పెట్టాను. చాలా రోజులైంది. తిరిగొద్దాంరా'' అని లాక్కెళ్ళాడు.

ఇద్దరూ కలిసి కొందరు పాతఫ్రెండ్సుని కలిసారు. హోటల్లో టిఫిన్ కానిచ్చి సినిమాకెళ్ళారు. మళ్ళీ బైటే తిని ఎక్కడెక్కడో తిరిగారు. రాత్రయ్యేదాకా వదిలిపెట్టలేదు సారధి చెలాన్ని.

## లక్కీ కత్రినా!

**మోడలింగ్ చేస్తూ అతి తక్కువ కాలంలోనే పాపులర్ అయిన కత్రినా కైఫ్ తెలుగులో నటిస్తున్న 'మల్లీశ్వరి' చిత్రం ఇంకా రిలీజ్ కానే లేదు, ఆమెని మరో ఛాన్స్ వరించింది. 'మల్లీశ్వరి'లో వెంకటేష్‌కి జోడీగా నటిస్తుంటే, ఇప్పుడు నాగార్జునకి జంటగా మరో చిత్రంలో నాయికగా కత్రినా ఎన్నికైనట్టు టాలీవుడ్ వర్గాల సమాచారం. డాన్స్ మాస్టర్ లారెన్స్‌ని డైరెక్టర్‌గా పరిచయం చేస్తూ నాగార్జున నిర్మించే చిత్రంలో కత్రినా నాయికగా నటించనుందిట. ఒక సినిమా రిలీజ్ కాకుండానే మరో సినిమా కొట్టేసిన కత్రినా కెరీర్ ఇంకెన్ని మలుపులు తిరుగుతుందో!**



చెలం సారధి అనుభవిస్తున్న ప్రేమరాహిత్యాన్ని గుర్తించాడు. ఇంట్లో ప్రేమ దొరకని మగవాడు స్నేహితుల్ని వెంటేసుకుని తిరుగుతాడు. భర్త దగ్గర ఆత్మీయత లభించకపోతే స్త్రీ పుట్టింటి మమకారాలని పెంచుకుంటుంది. వెరసి... మనిషి కోరుకునేదీ, ఆశించేదీ ఒక్కటే సాన్నిహిత్యం.

గుడ్‌నైట్ చెప్పేముందు తన మనసు బైటపెట్టాడు సారధి. ''నిన్న నీతో అన్నది ఏదో కేజువల్‌గా కాదురా చెలం. వసంతలో చాలా మార్పొచ్చింది. అది క్రమంగా వచ్చినది కాదు. పెళ్ళికి ముందు ఎలా వుండేదో నీకు గుర్తుందిగా? ముఖ్యంగా నాతో. పెళ్ళయ్యాక ఒక్కసారి మారిపోయింది. నిర్లిప్తంగా వుంటోంది. కొన్ని సంవత్సరాలుగా కలిసి వుండటానికి అలవాటుపడ్డవాళ్ళు విడిపోలేరు చూడు అలాంటి యాంత్రికమైన సాన్నిహిత్యానికి అలవాటుపడ్డాం''

చెలం నవ్వటానికి విఫలయత్నం చేసాడు. ''ఇంటి పనులతోటీ, పిల్లల బాధ్యతలతోటీ అలా వుంటుందేమో తను''

''నా అనుమానం... తను పెళ్ళికి ముందు ఇంకెవర్నేనా ప్రేమించిందేమోనని''

చెలాన్ని విభ్రాంతి మరోసారి ఆవహించింది. తేరుకుని అన్నాడు ''అదేంట్రా? నువ్వంటే ఇష్టమని చెప్పావు''

''ఇష్టం వేరు, ప్రేమ వేరురా. అది ఇప్పుడే అర్థమౌతోంది''

''....''

''ఆ విషయం... అంటే తన మనసులో ఎవరేనా వున్నారేమో అడగాలని అప్పుడప్పుడు అనిపిస్తుంది. కానీ పెళ్ళై పదేళ్ళై, ఇద్దరు పిల్లలు పుట్టాక ఆమెని అలా అడిగి అవమానపర్చలేను. అంతేకాదు, అలాంటిదేమైనా వుంటే?''

''ఉంటే?''

''అంత స్పష్టంగా తెలిసిన నిజాన్ని నేను తట్టుకోలేను. ఇద్దరం విడిపోగలమా? పిల్లల భవిష్యత్తు ఏమౌతుంది?''

''సారధీ!''

''మళ్ళీ నాకే అనిపిస్తుంటుంది. నా ఆలోచనల్లో ఏదైనా లోపం వుందేమో! పెళ్ళయ్యాక ఆడవాళ్ళు అలాగే వుంటారేమో!''

''అందరూ అంతేనా?''

''అంతేనేమో, ఎందరు లేరు. ఒకరు లేకపోయినా రెండోవారు ఆ వెల్తిని ఏదో ఒకలా పూడ్చుకుని చివరిదాకా బతుకుతున్నవాళ్ళు?''

''ఒకళ్ళు పోగానే రెండోవాళ్ళు పోవాలనా?''

''బతకలేమనిపించాలి. జీవచ్ఛవాలుగా మారిపోవాలి. వాళ్ళ ఆలోచనల్లోనూ ఆఖరుకు విడిచే శ్వాసలోనూ కూడా అవతలివారి జ్ఞాపకాలే వుండాలి''

''నువ్వు చాలా సెల్ఫిష్‌గా ఆలోచిస్తున్నావు. అలా ఎందుకుంటుంది? ఎవరి జీవితం వాళ్ళది''

''ఎందుకుండకూడదు? పెళ్ళయ్యాక ఇంకా

ఇండివిడ్యువాలిటీ ఏంటి?'' గట్టిగా అన్నాడు సారధి.


ఒక్క క్షణం వూరుకుని చెలం మెల్లగా అడిగాడు ''పోనీ నీకుందా వసంతపట్ల అలాంటి ప్రేమ?''

సారధి దెబ్బతిన్నాడా ప్రశ్నకి. ''తనకి లేనిదే నాకెలా పుడ్తుంది?''

''తనూ అలాగే అనుకుంటే?''

ఆ చీకట్లో సారధి ముఖం వికసించడం చెలానికి కనిపించలేదు.

''అంత ప్రేమ వసంత మీద వొలికిద్దామని చూసాన్రా! తను విసుక్కుంది'' అన్నాడు నవ్వేస్తూ.




''ప్రకటించుకునేదీ, ప్రదర్శించుకునేదీ ప్రేమకాదు సారధీ. నిశ్శబ్దంగా గుండెల్లో పుట్టి, నిలువెల్లా నిండి, మనమీద మనకి నియంత్రణ లేకుండా చేసేది ప్రేమంటే. అలాంటి ప్రేమని నేను అనుభవించాను. దానికి రెసిప్రొకేషన్‌తో నిమిత్తం లేదు. కానీ నాది ప్రేమని తెలిసి ఆమె ముందు వ్యక్త పరిచేలోపే ఆమె పెళ్ళైపోయింది'' మొదటిసారి తన ప్రేమ గురించి మాట్లాడాడు చెలం.

''మరి... ఆమె?''

చెలం నవ్వాడుగానీ జవాబివ్వలేదు.

ఇప్పుడిప్పుడే ఆ విషయాలన్నీ మర్చిపోయి పెళ్ళి చేసుకోబోతున్న అతన్నింకా కదిలించి బాధపెట్టడం దేనికని సారధి అంతటితో వదిలేసాడు.

★ ★ ★

చెలానికి ఫోన్‌చేశాక వసంతలో ఉద్వేగం చాలావరకూ తగ్గింది. తనూ, చెలం ప్రేమించుకున్నారు. కానీ తన పెళ్ళి సారధితో జరిగింది. పదే పదే ఆ విషయం మనసుకి స్ఫురించి, క్రమంగా అలవాటైపోయింది.

మళ్ళీ అదే యాంత్రికత.. అదే జడత్వం. ఏవైతే సారధికి ప్రేమరాహిత్యమనిపిస్తున్నాయో అవి.

సంఘటనలు జరుగుతాయి. వాటి ప్రభావం మనిషి మీద వుంటుంది. కానీ వాటిలోంచీ బాధనో, సంతోషాన్నో పుట్టించేది మాత్రం మనసు. అది చేసే ఆలోచనలు, ఆ ఆలోచనల తాలూకూ జ్ఞాపకాలు.

దాదాపు పదేళ్ళు వెనక్కి వెళ్ళిపోయింది వసంత.

''సారధిని చేసుకుంటావటే? వాళ్ళూ మనతో సంబంధానికి ఇష్టపడుతున్నారు. నాన్న వెళ్ళి అడిగితే సరేనన్నారు'' అడిగింది తల్లి.

అప్పటిదాకా వసంత పెళ్ళిని గురించి నిర్దుష్టంగా ఏమీ అనుకోలేదు. బివిస్సీ చదువుతోంది. చదువే లోకంగా వుంది. తనతో ఆడి, తిరిగి తనతో పాటే పెద్దైన సారధి పెళ్ళికొడుగ్గా మారాడన్న విషయం గుర్తించలేదు. ఒక్కసారిగా తల్లి అలా అడిగేసరికి తడబడిపోయింది. వెంటనే చెలం గుర్తొచ్చాడు. అది కేవలం ఇన్‌స్టింక్చువల్. దానికింకా భావరూపం లేదు.


''సారధికన్నా చెలం బెటరు'' అనేసింది అనాలోచితంగా.

''వాళ్ళకీ మనకీ ఎలా కుదుర్తుంది? వాళ్ళది వేరే కులం'' వెంటనే జవాబిచ్చిందావిడ.

అప్పటికి వూరుకున్నా తర్వాత భర్తతో చెప్పింది. ''అది చెలాన్ని చేసుకుంటానంటోంది. అదేదో అతనిదాకా వెళ్ళి గొడవయ్యేలోగా ఈ పెళ్ళి జరిపించటం మంచిది''

ఆయన ముఖం కోపంతో ఎర్రబడింది.

మనిషి- భారతీయుడు, హిందువు, ముస్లిము, క్రిస్టియను, ఆంధ్రప్రదేశ్‌లోవాడు, ఆంధ్ర, తెలంగాణా, రాయలసీమ, తూర్పువాడు, పడమటివాడు, హైద్రాబాదీ... బ్రాహ్మడు, రెడ్డి, వెలమ, కమ్మ, కాపు... నియోగి, వైదీకి, ద్రావిడ, ఆరువేల నియోగి, ప్రథమశాఖ నియోగి... తన చుట్టూ ఎన్ని ఇరుకు గోడలు కట్టుకుంటున్నాడో! ఇవికాక వున్నవాడు, లేనివాడు అనే భేద భావం. ఆ గోడల మధ్య తనో మూసబొమ్మ. ఇంత ఇరుకు మనసనేది పిడికిట్లో బిగించి పట్టుకున్న మొగ్గలాంటిది.




అది వికసించకూడదు. వికసిస్తే నలిపెయ్యాలి. దాని పేరే సంస్కృతి. నాగరీకత. అయినా అనాగరికంగా కొన్ని మనసులు వికసిస్తూనే వుంటాయి.

వసంత ఇష్టాయిష్టాలతో సంబంధం లేకుండా ఆమె పెళ్ళి సారధితో జరిగిపోయింది. చెలం మనసులో ఏముందో ఆమెకి తెలీదు. తర్వాత తెలిసింది అతనెవర్నో ప్రేమించి భంగపడ్డాడని. ఆ 'ఎవరో' తనేనని ఇప్పటికి అర్థమైంది.

★ ★ ★

చెలం వసంతతో ఒంటరిగా మాట్లాడాలనుకున్నాడు. ఎవర్నో పెళ్ళిచేసుకోవాలనుకున్న అతని నిర్ణయం ఇప్పుడు పూర్తిగా వీగిపోయింది.

★ ★ ★

ఒక సమావేశం...

కొన్ని సంవత్సరాలక్రితమైతే చక్కటి ప్రణయ వేదికయ్యేది. కానీ ఇప్పుడు రెండు వేరు వేరు గతాలకి ఐక్య వేదికైంది.

''వసంతా! సారధికి విడాకులివ్వు. మనిద్దరం ఎటేనా దూరంగా వెళ్ళి పెళ్ళి చేసుకుందాం'' అన్నాడు చెలం సూటిగా.

''మరి మా పిల్లలు?''

సూటిగానే వచ్చి తాకింది అతన్నా ప్రశ్న కూడా. కానీ జవాబుకి వెతుక్కోలేదు.

''వాళ్ళని వదిలిపెట్టి వుండలేననుకుంటే నీతో తీసుకొచ్చెయ్. సారధి పిల్లలు నాకు పైవాళ్ళు కారు'' అన్నాడు. ''కానీ వాళ్ళకి నువ్వేమౌతావు?''

''వసంతా!''

''వాళ్ళ ఇన్‌స్టింక్ట్సు నిన్ను తండ్రిగా ఒప్పుకోనివ్వదు. వాళ్ళకి సారధితో బలమైన అనుబంధం వుంది. వాళ్ళతన్ని వదిలిపెట్టి వుండలేరు. నన్నూ వదులుకోలేరు. చెలం! నేను ప్రేమకోసం ఏదైనా చెయ్యగలిగే స్టేజిని దాటిపోయాను'' అంది వసంత.

ఆమె ముఖంలో తీవ్రమైన సంఘర్షణ కనిపిస్తోంది. సమాజం, కుటుంబం, భర్త, పిల్లలు అనే చట్రంలో బిగించబడి వుంది ఆమె మనసు. చెలం పట్ల ప్రేమ అనేది ఒక ఆకర్షణ. దాన్ని తట్టుకునేందుకు ఆమె సంఘర్షిస్తోంది.

ఆమె మాటల్ని జీర్ణించుకునేందుకు చెలానికి కొద్ది వ్యవధి పట్టింది. నిజమే! తన ఊహలకి అందనంత దూరంలోనే వుంటోందామె ఎప్పుడూ. తనతో షటిల్, గల్లీ క్రికెట్టూ ఆడి అప్పుడప్పుడు బైక్‌మీద లిఫ్టడిగి కాలేజీకి వెళ్తూ, చుడీదార్లో తిరిగే అమ్మాయి పెళ్ళికి ఎదిగిపోయిం

దని సారధి ఫోన్‌చేసి చెప్పేదాకా తెలీలేదు.

ఆ తర్వాత కూడా తన మనసులోనే పుట్టి, పెరిగి వూహాలోకాల్లో తనతో సంచరించింది ఆమె ఒక ప్రేమభావన. ఆమెకి ప్రేమ తప్ప లౌకికమైన బాధ్యతల్లేవు. తనకోసం పరితపిస్తుంది. తనే లోకమంటుంది. తామిద్దరి ఆంతరంగిక ప్రపంచం ఒకటి. కానీ ఆమెకి భౌతికమైన రూపం లేదు. రూపంలేని అంతరంగాన్ని ప్రేమిస్తూ వచ్చాడు. భౌతికంగా తన ముందున్న ఈ వసంత ఆంతరంగికంగా తనకెంతో దూరంగా వుంది.

''నేను చాలా తెలివి తక్కువవాడిని కదూ వసంతా? నిన్ను ప్రేమించినవాడిని ఆ విషయం నీకెప్పుడూ చెప్పలేదు. అసలేంటో నువ్వూ నేనూ వేరు వేరని ఎప్పుడూ అనిపించేది కాదు'' ఆవేదనగా అన్నాడు.

''జరిగిపోయినవి ఇప్పుడెందుకు చెలం?''

''నాకెందుకు ఫోన్ చేసావు?''

''ఒకసారి ఈ విషయాన్ని గురించి మనం మాట్లాడుకుంటే బావుంటుందనిపించింది. ఈ ఉద్వేగాల్లోంచీ బైటపడ్తామని''

''ఔను. మనది తొలిప్రేమ కదూ?'' నిరసనగా అన్నాడతను.

అతని గుండెల్లో బాధ సుడులు తిరుగుతోంది. ఒక్క క్షణం మౌనంగా కళ్ళు మూసుకుని దేవుడిని ప్రార్థించాడు- ఓ దేవుడా! మళ్ళీ జన్మంటూ వుంటే అప్పటికి ఈ దేశాన్ని కులమత రహితంగా వుంచు. అలా కాకపోతే కనీసం అలాంటి భేదాలు లేనిచోట మా ఇద్దర్నీ పుట్టించు అని. కానీ అప్పుడు వాళ్ళిద్దరి మధ్యా ప్రేమ పుడ్తుందాని.

''ఏమిటి చెలం?'' అతను కళ్ళు మూసుకోవడం చూసి అడిగింది వసంత.

అతను జవాబివ్వలేదు. ''ఇంతేనా వసంతా?'' చాలా సేపటికి అడిగాడు.

''ఇద్దరం.. మిగిలిన జీవితమంతా ఒకరికొకరం ఏమీ కాకుండా మిగిలిపోవాలా?''

అతని మాటల్లో ధ్వనించిన విషాదం వసంతని కుదిపేసింది. తట్టుకోలేక ఏడ్చింది. చాలాసేపు ఏడ్చింది. చెలం నిర్వికారంగా చూస్తూ కూర్చున్నాడు. ఆమెని ఓదార్చడానికి అతని దగ్గర మాటలే కాదు, భావాలు కూడా లేవు.

''నా చిన్నతనం గుర్తొస్తోంది చెలం!. ఎంత అందమైన రోజులవి. అమ్మా నాన్నల మధ్యని స్వేచ్ఛగా పెరిగాను. నాకేం కావాలనిపించినా వాళ్ళతో నిస్సంకోచంగా చెప్పేదాన్ని. వాళ్ళు కూడా ఎన్నో విషయాల్లో నాకోసం సర్దుకునేవారు. చెలం! వాళ్ళు తమ జీవితాన్ని పిల్లల చుట్టూ నిర్మించుకున్నారు. మేమే లోకంగా బ్రతికారు. ఇప్పుడు నేను నా ప్రేమ కోసం మా పిల్లల్ని ఇబ్బంది పెట్టనా? వాళ్ళు మన కోసం తల్లినో తండ్రినో వదులుకోవాలా? నువ్వు వాళ్ళని ప్రేమగానే చూస్తావు. ఆ ప్రేమతో వాళ్ళకి నువ్వొక మంచి అంకుల్‌వి కాగలవు. అంతేగానీ తండ్రివి కాలేవు'' అంది వసంత ఏడుపులోంచి బైటికి వచ్చాక.

ఆమె చాలా బాగా అర్థమైంది చెలానికి. నిశ్శబ్దంగా లేచి నిలబడ్డాడు.

''నువ్వూ పెళ్ళిచేసుకో చెలం. ఒకరిద్దరు పిల్లల్ని కను. అప్పుడు నీకే తెలుస్తుంది నువ్వు నువ్వుగా మిగిలిలేవని''

చెలం వెళ్ళిపోయాడు.

★ ★ ★

చెలం పెళ్ళి చేసుకున్నాడు. వసంత చెప్పిన అనుభవం కోసం పెళ్ళిచేసుకున్నాడు. తనని తను ఇంకేవో అనుబంధాల్లో కోల్పోవడం కోసం చేసుకున్నాడు. తనంటూ లేకపోతే తనకి సంబంధించిన దుఃఖమూ వుండదని చేసుకున్నాడు. పెళ్ళి పనులన్నీ సారధే భుజం మీద వేసుకుని తిరిగాడు. పెళ్ళి అదే వూళ్ళో కావడంతో వసంతకి వెళ్ళక తప్పలేదు. ఇన్నాళ్ళూ చెలం మౌనంగా అనుభవించిన బాధ ఇప్పుడు వసంతకి అనుభవంలోకి వచ్చింది. మనసెంత రాయి చేసుకుని ఆలోచనలని నియంత్రించుకున్నా మరొకమ్మాయి పక్కన అతన్ని చూశాక బాధ కలగకుండా వుండలేదు. పెళ్ళి జరుగుతున్నంత సేపూ ఆమె కళ్ళలో అప్పుడప్పుడు కదిలిన తడి సారధి దృష్టిలో మొదటిసారి పడింది. అతను విచలితుడయ్యాడు.

★ ★ ★

తను దేన్నైతే శోధించాలనుకుని పర్యవసానానికి భయపడి మానేసాడో ఆ విషయం యిలా బైటపడుతుందనుకోలేదు సారధి. చెలం, వసంతా ఒకరినొకరు ప్రేమించుకున్నారు. తనంత తొందరగా పెళ్ళి చేసుకోకపోతే వాళ్ళు చేసుకునేవారేమో! అతనికి ఇరుగ్గానూ ఇబ్బందిగానూ అనిపిస్తోంది. తప్పు చేసినట్టుంది. వసంతతో ఫ్రీగా మాట్లాడలేకపోతున్నాడు. అతనికి ఆమెమీద కోపం రాలేదు. కారణం ఒకటే- వాళ్ళ అనుబంధం పెళ్ళితో మొదలైనది కాదు, ఆరేళ్ళ వయసులో తల్లి చెయ్యి పట్టుకుని అప్పుడే పుట్టిన వసంతని చూడటానికి హాస్పిటల్‌కు వెళ్ళినప్పటిది.

★ ★ ★

ఏదో కావాలని ఆరాటపడి, అదేమిటో తెలీని అయోమయంలో గడిపి.. తీరా తెలిసాక అందనంత దూరాన తనుండటం అనే మూడు స్టేజిలని దాటింది వసంత. నైరాశ్యం ఆమె నిండా అలుముకుంది. తను ఒంటరిదైతే ఎలాగో రోజుల్ని వెళ్ళదీసేదేమో. కానీ సారధి? అతని ఎదుటపడలేకపోతోంది. అతను కూడా అదే సంఘర్షణలో వున్నాడని అర్థమై మరింత ముడుచుకుపోయింది.

★ ★ ★

సారధి వసంతని నిశితంగా గమనిస్తున్నాడు. ఆమెలో కనిపిస్తున్న నైరాశ్యం, నిర్లిప్తత అతన్ని కదిలిస్తున్నాయి. తప్పంతా తనదేననిపిస్తోంది. ఏం చేస్తే వసంత జీవితంలో ఏర్పడిన ఈ వెలితిని పూడ్చగలడు? అతనిలో ఒక తపన మొదలైంది.

సారధిని చేసుకుని ఏం సుఖపెట్టింది. తన వెతుకులాటలో తనుండి అతనికి అందీ అందనంత దూరంలో నిలిచిపోయింది. ఆ దూరాన్ని చెరపాలని ఇద్దర్లో ఎవరూ అనుకోలేదు. పెళ్ళి చేసుకున్నందుకు అదో బాధ్యతలా కాపురం చెయ్యటానికీ, ఇష్టంగా కలిసుండటానికీ గల తేడా అర్థమౌతోంది వసంతకి.

కొన్ని భావాలు ప్రకటింపబడకపోయినా అవి ఎవరిని చేరాలో వారిని చేరుతూనే వుంటాయి. వసంతలోని మార్పుని చూస్తున్నాడు సారధి. అతని తపన అర్థమౌతోంది వసంతకి. ఇద్దరిమధ్యా అంతఃస్పర్శ మొదలైంది. ఒకరికేం కావాలో ఇంకొకరికి చెప్పకుండానే తెలుస్తోంది.

★ ★ ★

ప్రేమని చెలం నిర్వచించాడు. సారధికి ఇప్పుడు అనుభవంలోకి వచ్చింది. వసంత మాటలు అతన్నిప్పుడు బాధపెట్టడం లేదు. ఆమె నుంచి అతనేమీ ఆశించడం లేదు. అతని మనసునిండా వసంత. ప్రాణం వసంత. ఊపిరి వసంత. ప్రపంచాన్ని మర్చిపోయాడు. ప్రేమ రాహిత్యంలోంచీ ప్రేమలోకి అడుగుపెట్టాడు.

వసంత కూడా కూరలు తేవడాన్ని గురించీ, వంట గురించీ అతన్ని అడగటంలేదు. అలాంటి బాహ్యవిషయాలని తమ మధ్యకి రానివ్వటం లేదు.

